# కర్నూలు జిల్లాలో పనిచేయడం చాల సంతృప్తి నిచ్చింది : జాయింట్ కలెక్టరు



**కర్నూలు, జూలై 22, ప్రభాతవార్త:**
కర్నూలు జిల్లాలో పనిచేయడం చాల సంతృప్తి నిచ్చింది. బదిలీపై తిరుపతి వెళ్తున్న కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టరు నారపురెడ్డి మౌర్య అధికారులనుద్దేశించి ప్రసంగించారు. సోమవారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం తిరుపతి మున్సిపల్ కమిషనరుగా బదిలీ అయిన నేపథ్యంలో రిలీవ్ అయి వెళ్తున్న సందర్భంగా జాయింట్ కలెక్టరు నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ బదిలీల్లో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనరుగా ఉత్తర్వులు వెలువడడం జరిగిందని అందులో భాగంగా నేడు కర్నూలు జాయింట్ కలెక్టరు బాధ్యతల నుండి రిలివ్ అయి బుధవారం రోజు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనరుగా బాధ్యతలు చేపట్టడం జరుగుతుందన్నారు. విభజన తరువాత నంద్యాల జిల్లా విధులు నిర్వహించానని అయితే నంద్యాల జిల్లాతో పోలిస్తే కర్నూలు జిల్లాలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు ఉన్న జిల్లాలో మళ్లి పోస్టింగ్ రావడం అదృష్టంగా భావిస్తున్నాన న్నారు. అదేవిధంగా జిల్లాలో గొడవలు చాల తక్కువగా ఉంటాయన్నారు. ఇక్కడి ప్రజల చాల మృదు స్వభావులు జిల్లా కొంత వెనుకంజలో ఉన్నప్పటికి అధికారులే బాధ్యత తీసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కర్నూలు జిల్లాలో భవిష్యత్తులో విధులు నిర్వహించే అవకాశం వస్తే తప్పనిసరిగా వినియోగించుకుంటానని తెలిపారు. ముఖ్యంగా ఆధోని సబ్ కలెక్టరు, పత్తికొండ ఆర్డీఓ, కర్నూలు ఆర్డిఓలు అందరు తహాశీల్దార్‌లు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందించారని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల్లో అందరు మంచి సహాయ సహకారాలు అందించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డిఆర్వో మధుసూధన్‌రావు, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 832 అడుగులకు చేరిన..
# నీలంసాగర్ డ్యాం

**శ్రీశైలంప్రాజేక్టు, జులై22, ప్రభాతావార్త**
కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన బారి వర్షాలు కారణంగా వాగులు, వంకలు సైతం ఒక్కటిగా కావడంతో జలాశయాలు పోంగిపోర్లి పెద్ద ఎత్తున వరద నీరు దిగువ జలాశయాలకు వచ్చిచేరుతుంది. నీటి ప్రవాహంతో రిజర్వయర్‌లు జలకళను సంతరించుకుంటున్నాయి. వరద నీటితో కృష్ణమ్మ పరుగులు తోక్కుతూ వడివడిగా ముందుకు దూసుకు వస్తుంది. శ్రీశైలం రిజర్వయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా డ్యాం నీటినిల్వ సామర్ధ్యం 215.807 టియంసిలుగా ఉంది. రోజరోజుకు జూరాల ప్రాజెక్టు గుండా శ్రీశైలం జలాశయంకు నీటి చేరికలు వేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యాంలోనే డ్యాం నీటిమట్టంలో శరవేగంగా మార్పులు జరుగుతున్నాయి. కాగా సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి నీలంసాగర్ డ్యాం నీటిమట్టం 832.50 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్ధ్యం 52.1476 టియంసిలుగా నమొదు అయింది. శ్రీశైలం రెండు జలవిధ్యుత్ కేంద్రాల్లో ఎటువంటి ఉత్పత్తి జరగడం లేదు. అదే విధంగా ఎగువన ఉన్నా జూరాల ప్రాజెక్టులో క్రస్టుగేట్లను తెరచి స్పిల్‌వే గుండా 1,45,410 క్యూసేక్కుల నీరు, విధ్యుత్ ఉత్పత్తి ద్వారా 29,307 క్యూసేక్కుల నీరు మొత్తం 1,74,717 క్యూసేక్కుల వరద నీరు శ్రీశైలం డ్యాంకు వచ్చిచేరుతుంది.



# అక్రమ రిజిస్ట్రేషన్ల.. అడ్డా..!

- కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై పెరుగుతున్న ఫిర్యాదులు
- జిల్లా రిజిస్ట్రార్ పనితీరుపై విమర్శలు
- వక్ఫ్.. దేవాదాయ.. ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు..?
- రోడ్డున పడ్డ రిజిస్ట్రేషన్ శాఖ పరువు, ప్రతిష్టలు



**కర్నూలు నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతిలో కూరుకుపోయాయి. ఒకటి రెండు అని కాకుండా తవ్వే కొద్ది అక్రమాలు బయట పడుతూనే ఉన్నాయి. వాటిని నియంత్రించాల్సిన అధికారులు విఫలమవడంతో వివాదాలు రోడ్డెక్కాయి. ప్రజాసంఘాలు ఆందోళనలు ప్రారంభించాయి. కర్నూలు కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతికి జిల్లా రిజిస్ట్రార్ వంత పడుతున్నారని మొన్న ప్రజా సంఘాలు ధర్నా చేశాయ్... నిన్న డిఐజీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాయి. రేపు మరో ఆందోళనకు శ్రీకారం చుట్టనున్నాయి. ఆ రెండు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములు తప్పుడు రిజిస్ట్రేషన్‌లతో అక్రమార్కుల వశమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ వ్యవహారాలను చక్కదిద్దలేని ఉన్నతాధికారులపై కూడా భారీగానే విమర్శలు వస్తున్నాయి.**

**కర్నూలు, జూలై 23, ప్రభాత వార్త :**
కర్నూలు నగరంలో కర్నూలు, కల్లూరు మండలాలకు సంబంధించిన సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయి. రెండు కార్యాలయాలు కర్నూలు నగర పరిధికి సంబంధించిన కావడంతో ఇక్కడి ప్రతిరోజు వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతూ ఉంటాయి. జిల్లా కేంద్రంతో ముడిపడి ఉన్న ప్రాంతాలు కావడంతో ఇక్కడ భూములకు ధరలు భారీగా ఉన్నాయి. దీంతో అక్రమార్కులు ఆయా భూములను దక్కించుకునేందుకు తప్పుడు మార్గాలు ఎంచుకున్నారు. వారికి కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు సహకరించడంతో పలు అక్రమాలు జరిగాయి. జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన ఆయన పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు రెండు రోజుల క్రితం బాధితులు ధర్నా చేశారు. తాజాగా డీఐజీకి ఫిర్యాదు చేశారు. ఈ ధర్నాలు, ఆందోళనలు ఎంత దూరం వెళ్తాయో చెప్పలేని పరిస్థితి.

ఒక సబ్ రిజిస్టర్ చేసిన వ్యవహారం గతంలో లోకాయుక్త వరకు వెళ్ళింది. సంబంధింత కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో పనిచేసిన చైతన్యరాయలు ఒకరి ఇంటి స్థలాన్ని తప్పుడు పత్రాలతో మరొకరికి రిజిస్ట్రేషన్ చేశాడు. బాధితులు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ విషయంపై అక్కడ కేసు నమోదు అయింది. కర్నూలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను రిసిప్టులు నకిలివి పెట్టి దండుకున్నారు. ఆ వ్యవహారం బయటకు రావడంతో నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఇలా కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో అవినీతి రోజుకు పెరిగిపోతుంది. తాజాగా ప్రజా సంఘాల ఆందోళన మేరకు చెబుతున్న విషయాలు. కర్నూలు సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో సర్వే నెంబర్ 19/136లో నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తున్నారు.

• వివరాలు 2లో

# రాక్షస.. కోపం..!

- పసిపాప శరీరంపై వాతలు...
- పోలీస్ స్టేషన్‌కు వెళితే పెద్దసారు లేడన్నారు...





**మిడుతూరు, జూలై22, ప్రభాతవార్త;**
ఆమె ఒక మహిళ, తన బిడ్డకు తల్లి. కన్న ప్రేమ అంటే ఏమిటి అనేది ఆ తల్లికి తెలుసు. కానీ పసిపాపకు చలాకీతో బాధపెట్టడం ఏమంటారు.... దీనినే రాక్షస కోపం అంటారు కదా.... పసిపాపకు మొదటి పెట్టిన వాతకు ఆ పసికందు అమ్మా అని అరిచిన అరుపుకు రెండవ వాత పెట్టేముందు కర్కస మహిళ మనసు కరగలేదా.... ఆ పసికందు కన్నీరు ఆమె కోపాన్ని కరిగించలేదా... మానవత్వం మంట కలుపుతూ చిన్నారులపై తమ రాక్షస ప్రతాపం చూపుతున్నారు. ఇప్పుడున్న జనరేషన్‌లో ఇలాంటి సంఘటనలు జరగడం రాక్షస మనస్తత్వాల వికృత చేష్టలకు పరాకాష్ట. బాధితులు పాకు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళితే... పెద్ద సారు లేడు మరోసారి రండి అని పోలీసులు అన్నారని బాధితులు అంటున్నారు. ఇలా రెండు రోజులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తమకు న్యాయం చేయాలని తిరిగినా మరోసారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తామని పాపకు అన్యాయం చేసిన వారికి కఠిన చర్యలు తీసుకునేవరకు వదిలిపెట్టమని బాధితులు అంటున్నారు. బాధితులు చెప్పిన

**వివరాలు ఇలా ఉన్నాయి...**
మిడుతూరు మండలంలోని తలముడిపి గ్రామానికి చెందిన బాలకృష్ణ, శ్యామల దంపతుల కుమార్తె 1వ తరగతి చదువుతున్న మైథిలి అనే బాలిక శరీరంపై అదే గ్రామానికి చెందిన హుసేనమ్మ చెలాకీని వేడి చేసి వాత పెట్టి తన రాక్షస కోపాన్ని చాటుకుని సంచలనం సృష్టించింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారి మైథిలితో పాటు మరొక బాబు ఇరువురు కలిసి ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నారు. అయితే అక్కడే హుసేనమ్మ తన ఇంటి ముందు మంచంపై ఉతికిన బట్టలను ఆరబెట్టుకుంది. కాగా ఇరువురు పిల్లలు ఆడుకుంటూ మంచంపై పడడంతో ఆ బట్టలు కింద పడ్డాయి. దానిని గమనించి ఆగ్రహంతో హుసేనమ్మ ఇరువరిలో దొరికిన మైథిలిని ఇంటిలోకి తీసుకెళ్లి కట్టేసి స్టవ్‌పైన చెలాకిని వేడి చేసి తొడపైన, పిక్కపైన వాతలు పెట్టిందని బాధితులు చెప్పారు. దీంతో చర్మం పొంగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మైథిలి బాధతో విలవిల్లాడిపోయింది. మైథిలికి వాత పెట్టిన విషయం తెలుసుకున్న తల్లి శ్యామల, హుసేనమ్మ దగ్గరికి వెళ్లి ప్రశ్నించగా ఆమె ఎదురుదాడికి దిగిందని బాధితులు తెలిపారు. వెంటనే పసిపాపను తీసుకొని అవ్వ శివమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పెద్దసారు లేదని రేపు రమ్మని చెప్పారని, మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌కు వెళితే పెద్దసారు లేదని నందికొట్కూరుకు వెళ్లమని సలహా ఇవ్వడంతో పసిపాప, అవ్వ అక్కడికి వెళ్లగా అక్కడ పెద్దసారు లేదని సమాధానం చెప్పడంతో బాధితులు ఇంటికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న విలేకరులు బాధితుల ఇంటికి వెళ్లి విచారించగా చిన్నారి మైథిలి శరీరంపై....

• వివరాలు 2లో

# వరదనీటితో కళకళలాడుతున్న.. తుంగభద్ర

- నదికి మరియు హెచ్‌ఎల్‌సి కెనాల్‌కు నీరు విడుదల
- నది తీర ప్రాంతాల వారికి మొదటి హెచ్చరికలు జారీ చేసిన బోర్డు అధికారులు

**హొళగుంద, జూలై 22, ప్రభాతవార్త**
కర్ణాటక ప్రాంతంలోని హోస్పేట్ పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో నిర్మించిన తుంగభద్ర జలాశయానికి భారీగా వరదనీరు వచ్చిచేరడంతో ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సి, నదిలోకి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసినట్లు తుంగభద్ర డ్యాం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నదితీర ప్రాంతాల వారు, గొర్రెల కాపర్లు, హౌస్ పంపింగ్ వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, ఆగుంబే తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాంకు భారీగా నీరు వచ్చి చేరడంతో నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నదికి 87.056టిఎంసిల నీరు 3గేట్ల ద్వారా 3987క్యుసెక్కుల నీరు విడుదల చేసినట్లు తెలిపారు. తుంగభత్ర డ్యాం ప్రస్తుత నీటి నిల్వ 1627.79 ఉండగా 85.992టిఎంసిల నీరు ఉన్నాయన్నారు. తుంగభద్ర డ్యాం సామర్థ్యం 105.788టిఎంసిల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1.01993క్యుసెక్కుల నీరు ఉండగా డ్యాం నుండి నీరు విడుదల చేయడం వల్ల ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. నదికి 5వేల క్యుసెక్కుల ఔట్‌ఫ్లో నుండి 50వేల క్యుసెక్కుల ఔట్‌ఫ్లో మారవచ్చని ఇన్‌ఫ్లోను బట్టి ఏ సమయంలోనైనా పెంచవచ్చని తెలిపారు. నదుల మొత్తం ప్రవాహం 7744క్యుసెక్కులు ఉన్నట్లు తెలిపారు. హొళగుంద మండలంలోని తుంగభద్ర కాలువకు చేరుకున్న నీటిని సోమవారం ఉదయం టిబి బోర్డు అధికారులు ప్రసన్నకుమార్ ఎస్‌డిఓ, నవీన్ రెడ్డి ఎస్ఓ, గోపిచంద్ ఎస్ఓ, సిబ్బంది మహమ్మద్ రఫీక్, ఆనంద్, గౌస్, చిన్నలు ప్రత్యేక పూజలు చేశారు. తుంగభద్రకు నీరు రావడంతో రైతన్న కళ్లల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఇలాగే నీరు కొనసాగితే రెండు పంటలు తీయొచ్చని వారు పేర్కొన్నారు.






# మాలపల్లిలో వాటర్‌ప్లాంట్‌ను సీజ్ చేసిన తహాశిల్దార్

- వ్యాధులకు ఈ నీరే కారణమని గుర్తింపు - తదుపరి ఆదేశాల వరకు వాటర్‌ప్లాంట్ మూత - కఠిన చర్యలు తప్పవన్న తహాశిల్దార్

**మాలపల్లి(మంత్రాలయం), జూలై 22, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో ఉన్న రసూల్ వాటర్‌ప్లాంట్‌ను సీజ్ చేసినట్లు మంత్రాలయం తహాశిల్దార్ శ్రీధర్‌మూర్తి సోమవారం విలేకరులకు తెలిపారు. ముఖ్యంగా మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో గతకొద్ది రోజులుగా ప్రజలు పడుతున్న డయేరియా వ్యాధులకు ఈ నీరే కారణంగా రిపోర్టు వచ్చినట్లు తెలిపారు. వివరాల మేరకు సుంకేశ్వరి గ్రామానికి మాలపల్లిలో ఉన్న రసూల్, జైశ్రీరామ్ అనే రెండు వాటర్‌ప్లాంట్‌ల నుండి తాగడానికి నీరు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే సుంకేశ్వరి గ్రామంలో డయేరియా కేసులు అధికం కావడంతో అధికారులు ఈరెండు వాటర్‌ప్లాంట్‌ల నీటిని పరీక్షించేందుకు ల్యాబ్‌కు తరలించారు. నీటి నాణ్యతను పరిశీలించిన అధికారులు ఇందులో రసూల్ వాటర్‌ప్లాంట్ నీటిలో తగిన మోతాదులో క్లోరిన్ లేనట్లు గుర్తించారు. అదేవిధంగా ఈ నీటిలో ఈకలి బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా నీటిలో ఉంటే వ్యాధులు ప్రభలే అవకాశం అధిఖంగా ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. కావున గ్రామ ప్రజల ఆధ్వర్యంలో తహాశిల్దార్ ఈ వాటర్‌ప్లాంట్‌ను సీజ్ చేశారు. ప్రభుత్వం తదుపరి ఆదేశాల ఇచ్చేంతవరకు ఈ నీటిని ప్రజలకు విక్రయించరాదని తహాశిల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వీరివెంట ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓఆర్‌డి ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి స్వామినాథం, విఆర్‌ఓ రాజు గ్రామ సర్వేయర్ తిమ్మేష్ తదితరులు ఉన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, జూలై 22, ప్రభాతవార్త :**
ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్య పరిష్కార వేదికకు వస్తున్న వినతుల పరిష్కారానికే అధికారులు మొదటి ప్రాధాన్యత ఇస్తూ వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో సమస్యలను పెండింగ్ ఉండకుండా పూర్తి చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల జిల్లా అధికారులకు అందచేస్తూ, దరఖాస్తును పరిశీలించి అర్జీదారునికి సంతృప్తి ఇచ్చేలా పరిష్కారం ఇవ్వాలని ఆదేశించారు.. రెవెన్యూ సంబంధిత దరఖాస్తులకు తగిన పరిష్కారం చూపాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. కోడుమూరు మండలం, చనుగొండ్ల గ్రామానికి చెందిన గోరంట్ల అనే ఒక దివ్యాంగుడు వీల్ చైర్ లో ప్రజా సమస్య పరిష్కార వేదికకు రాగా జిల్లా కలెక్టర్ అతని దగ్గరకు వెళ్లి సమస్య గురించి ఆరా తీశారు... దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాకు మంజూరు అయిన వెంటనే అర్హత మేరకు అందజేస్తామని కలెక్టర్ దరఖాస్తుదారునికి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అందరికి న్యాయం చేస్తాం

**నంద్యాల, జూలై 22, ప్రభాతవార్త ప్రతినిధిః**
నంద్యాల టౌన్‌లో ఉన్న వారులను గత పాలకులు సమస్యల నిలయంగా మార్చారని ఏ సమస్య వచ్చిన ఆ సమస్యను తీర్చకుండా వాటిని అలాగే వదిలేయడంతో వార్డులని సమస్యల నిల యంగా మారాయని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. ఈసందర్భంగా నంద్యాల టౌన్ 37వ వార్డు టిడిపి ఇంచార్జీ మరియు మాజీ కౌన్సిలర్ మామిడి ఉషారాణి, మామిడి నాగరాజు కుమార్ అధ్వర్యంలో నిర్వహించిన నందమూరినగర్ వార్డు పర్యటనలో ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొనండంతో వార్డు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ వార్డు మొత్తం తిరిగి ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నాడు. వార్డులో రోడ్డు సరిగా లేవని కాల్వలు లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అలాగే వీధి దీపాలులేకపోవడంతో విష సర్పాలు తిరుగుతున్నాయని తెలపడంతో వెంటనే అక్కడ ఉన్నటువంటి అధికారులకు ఆ విషయాలను తెలియజేసి పరిష్కరించాలని కోరారు. అలాగే అక్కడ ఖాళీగా ఉన్న స్థలాలను కొందరు నాయకులు కబ్జా చేశారని తెలియడంతో వాటిపై కూడ త్వరలో విచారణ జరిపిస్తామని తెలియజేశారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా మీకు అండగా నేనుంటానని భరోసా ఇచ్చారు. నారాయణ, ఖలీల్, షబ్బీర్, నీలిమా, జ్యోతి, ఉమాకాంత్, తాటికొండ బుగ్గరాముడు, దేరెడ్డి శివనాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ మిద్దె చిన్నవుశేన్, మారాటి సూరి, బండల అక్బర్, మహేష్‌బాబు, సత్యరాజు, ప్రతాపరెడ్డి, వెంకటస్వామి, శరత్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

:- ఎమ్మెల్యే కెఈ శ్యామ్‌కుమార్‌ను కోరిన టిడిపి గిరిజన నేత వెంకటపతి



**తుగ్గలి, జూలై 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రెండవ గిరిజన మండలంగా ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన తుగ్గలి మండలంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కెఈ శ్యామ్‌కుమార్‌కు టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటపతి కోరారు. సోమవారం విజయవాడలో శాసనసభ సమావేశాలు జరుగుతున్న శాసనసభ ఆవరణలో ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్‌ను కలిసి గిరిజనుల అభివృద్ధి కోసం చేపట్టవలసిన విషయాలను తెలియజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేత రెండవ గిరిజన మండలంగా గుర్తింపు పొందిన తుగ్గలి మండలంలో 16గ్రామాలలో 100శాతం గిరిజనులు నివసిస్తున్నారన్నారు. ఈ గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీంతో ఎమ్మెల్యే గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన వాటిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు వెంకటపతి తెలిపారు.

## రోడ్ల మరమత్తులకు నిధులు కేటాయించండి



**ఆదోని, జూలై 22, ప్రభాతవార్త :** ఆదోని అసెంబ్లీ పరిధిలోని రోడ్ల మరమత్తులకు రూ.61కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పార్థసారథి రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశం అనంతరం మంత్రి చాంబర్‌లో ఎమ్మెల్యే మంత్రిని కలిసి ప్రతిపాదనలను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని అసెంబ్లీ పరిధిలో గల ప్రధాన రహదారుల రోడ్లు ఏర్పాటు, గ్రామాల అంతర్గత రోడ్ల ఏర్పాటు, మరమత్తులకు గురైన రోడ్లను యుద్ద ప్రాతిపదికన మరమత్తులు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అందుకు కావాల్సిన అన్ని చర్యలను చేపడతామన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తామని తెలిపినట్లు తెలియజేశారు. అసెంబ్లీ పరిధిలోని రోడ్లన్నింటికీ మహార్ధశ వస్తుందని ఆశావాహం వ్యక్తం చేశారు.

## బిసి బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి




**దేవనకొండ, జూలై 22, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో బిసి బాలుర వసతి గృహాన్ని పున:ప్రారంభించాలని అలాగే బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో పత్తికొండ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నిత్యం కరువు, కాటకాలతో సతమతమవుతోందని అన్నారు. కరువుతో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, వెళ్లే సమయంలో వారి పిల్లల చదువులకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందని మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యవసాయాలతో వందలాదిమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గత 40ఏళ్లుగా డిఎన్‌టి వసతి గృహం ఉండేదని, పక్కా గృహం లేదని ఇతర కారణాలు చూపి నిర్వహణ లోపంతో మూసివేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అడ్మిషన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు విన్నవించినా వాటిని గాలికొదిలేశారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి మూసివేసిన బిసి బాలుర వసతి గృహాన్ని పున:ప్రారంభించి, బిసి బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మధు, మండల నాయకులు మనోజ్, సురేంద్ర, అరవింద్, మహేష్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవినీతి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి... -విద్యార్థి సంఘాలు



**కర్నూలు విద్య, జూలై 22, ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రలో గర్భిణీల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ, పాత ఇనుం కుర్చీలు, మంచాలు లక్షల్లో అమ్ముకొని అవినీతికి పాల్పడిన సూపరింటెండెంటె మైత్రిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ, రామకృష్ణ, పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు సురేంద్రబాబు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాజీవ్, ఆర్‌విఎఫ్ అధ్యక్షులు కృష్ణ, ఆర్‌యుఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రఘులు మాట్లాడుతూ ఉద్యోగం మాత్రం ప్రభుత్వాసుపత్రిలో సేవలు మాత్రం సోమప్ప సర్కిల్ నందు ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ క్లినిక్‌లపై మక్కువచూపుతూ గర్భిణీల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసుకుంటుంది. ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చే గర్భిణిలను ఆశా వర్కర్ల ద్వారా సొంత ప్రైవేట్ క్లినిక్‌కు రెఫర్ చేసుకొని వారికి మాయమాటలు చెప్పి బిడ్డ అడ్డం తిరిగిందని, బిడ్డ ఉమ్మినీరు తాగిందని సీజెరియన్లు నిర్వహించి వేల రూపాయల డబ్బులు సొమ్ముచేసుకుంటుంది. గత కొద్ది రోజుల క్రితం వైద్యురాలు నిర్లక్ష్యం వల్ల శిశువు మృతి చెందింది. అయితే ఈవిషయం జిల్లా డిసిహెచ్‌కు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి ఫిర్యాదులు తీసుకొని వెళ్లిపోయిందే తప్ప ఇప్పటి వరకు ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత రెండు రోజుల ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో పాత ఇనుము, కుర్చీలు, మంచాలు లక్షల్లో అమ్ముకొని అవినీతికి పాల్పడినట్లు విచారణచేసి వెళ్లిపోయారు. ఈసూపరింటెండెంట్‌కు రాజకీయ అండదండలు మెండుగా ఉన్నాయి. కలెక్టరు స్పందించి డిసిహెచ్ఎస్, డిఎంఅండ్‌హెచ్ఓలతో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి-ఎంపిడిఓ శివశంకరప్ప

**వెల్దుర్తి, జులై22, ప్రభాతవార్త :** మండలంలోని వెల్దుర్తి-3, రామళ్లకోట, గోవర్ధనగిరి-2, లక్ష్మీనగరం గ్రామాల్లోని సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాల వద్ద మొబైల్ ఆధార్‌కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఎంపిడిఓ శివశంకరప్ప సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 27వ తేది వరకు పైన తెలిపిన 4 సచివాలయాల్లో జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు ఆధార్‌ను అప్‌డేట్ చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## పాఠశాల అభివృద్దికి ఎల్లవేళల ముందుంటా



**హొళగుంద, జూలై 22, ప్రభాతవార్త :** పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయం చేయడానికి ఎల్లప్పుడు ముందుంటానని యువనేత ఎస్‌కె గిరి అన్నారు. ఎస్ఎస్‌వి ఆద్వర్యంలో హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి యువనేత ఎస్‌కె గిరి ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్‌కి రూ.3100లు విరాళం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాల విద్యార్థులకు సహాయం చేయడానికి ముందుంటానని అలాగే విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఎవరు ఇబ్బంది పడకుండ దాతలు సహకారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నజీర్ అహ్మద్, పర్వద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో ముళ్లకంపలు తొలగింపు




**దేవనకొండ, జూలై 22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన దేవనకొండలో సర్పంచ్ రంగలక్ష్మి ఆద్వర్యంలో స్మశాన వాటికకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగలక్ష్మి మాట్లాడుతూ గ్రామ అభివృద్దే తమ ధ్యేయమన్నారు. ఎవరైనా మరణిస్తే స్మశానానికి అంత్యక్రియలకు వెళ్లే వారు అడ్డదిడ్డంగా పెరిగిన ముళ్లకంపలతో తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఇరువైపులా ముళ్లకంపలు తొలగించినట్లు తెలిపారు. గ్రామంలో ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త బండ్లయ్య పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

– జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌చార్జి ఎరుకుల సూర్య



**ఆదోనిలీగల్, జూలై22, ప్రభాతవార్త;** ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, చట్టాలపై అవగాహన సదస్సును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌చార్జి ఎరుకుల సూర్య, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎరుకల కుశలన్న అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కర్నూలులో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో ఉన్న 43 గ్రామాల్లో నేటికీ కుల వివక్షత కొనసాగుతుందన్నారు. దళిత గిరిజనులను రాజకీయంగా వాడుకోవడానికి వారిని ప్రలోభాలకు గురిచేసి వారి అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటిపై దర్యాప్తు చేయించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో నేటికీ తాగడానికి మంచినీరు లేవని, గ్రామీణ, పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని వాపోయారు. ఏపీలో ఎస్సీ, ఎస్టీలపై 2019 నుంచి మే 2024 వరకు ఎన్నో దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు, అత్యాయత్నాలు, హత్యలు, ఎస్సీ, ఎస్టీ భూములు కబ్జాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే వీటిపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఎస్పీని కలిసి వినతి పత్రం అందించారు.

## విద్యార్థులు స్థానిక వనరుల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి :- హెచ్ఎం భ్రమరాంబ




**పత్తికొండ, జూలై 22, ప్రభాతవార్త :** విద్యార్థులు స్థానిక వనరుల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని హెచ్ఎం భ్రమరాంబ అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిరోజు స్థానిక వనరులతో భోదన సామాగ్రి ప్రదర్శనకు సంబంధించిన అంశమును దృష్టిలో ఉంచుకుని వనరులను ప్రదర్శిస్తూ పిల్లలకు భోదించాలని తెలిపారు. బోధనలో స్థానిక వనరుల ప్రాముఖ్యతను టీచర్లు, పిల్లలకు తెలిపారు. పిల్లలు అనేక రకాల బోధన సామాగ్రిని నమూనాలను తయారు చేసి సేకరించి ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ఫెయిల్యూర్ అయిన ఈవీయంలు బెంగుల్లూరు తరలింపు




**నంద్యాల, జూలై 22, ప్రభాతవార్తప్రతినిధి :** సార్వత్రిక ఎన్నికలకు కోసం వచ్చిన ఈవీయంలల్లో ఫెయిల్యూరు అయిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లను సోమవారము రోజున బెంగుల్లూరుకు తరలిపస్తున్నట్టు జిల్లా కలెలక్టరు రాజకుమారి చెప్పారు. సోమవారము టెక్కె మార్కెట్ యాడులో భద్రపరచిన ఈవీయంల గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిదుల సమక్షంలో ఫెయిల్యూర్ అయిన వాటిని పరిశీలించారు. ఈసందర్భముగా కలెక్టరు మాట్లాడుతూ సారవ్రత్రికి ఎన్నికల్లో బాగంగా బెంగుల్లూరు నుండి వచ్చిన బెల్ కంపెనీ నుండి వచ్చిన ఈవీయలల్లో ఫెయిల్యూర్ అయిన ఈవీయంలు 435దింటిని బెంగుల్లూరుకు తరలిస్తున్నట్టు అమె చెప్పారు. కమీషనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఈవీయంలు 194 మాక్ పోల్ డిపెక్ట వచ్చినవి 111 రిజర్వ్ లు ఉన్న ఈవీయంలు 51 ఫస్ట్ లెవెల్లో పని చేయని ఈవీయంలుఎ 78 ట్రైనింగ్లో డిఫెక్ట్ వచ్చిన ఈవీయంల వెరసి మొత్తం 435 ఈవీయంలను సా ంక్ చేయడము పూర్తిఇందని వీటన్నింటిని బెల కంపనీ బెంగూల్లురుకు తరలిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక లోపం కారణంగా పని చేయడని 75కంట్రోల్ యూనిట్లు 165 వివిప్యాట్లు 195 బ్యాలెల్ యూనిట్లు మొత్తకళజపజ 435 ఈవీయంలు సోమవారము బెల్ కంపెనీ బెగుళ్లురూకు తరలిస్తున్న చెప్పారు.

## తిమ్మనాయునిపేటలో పేకాటరాయుళ్ల అరెస్ట్

**కొలిమిగుండ్ల, జూలై 22, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని తిమ్మనాయునిపేట గ్రామ సమీపంలో పేకాటాడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ గోపినాథ్‌రెడ్డి సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు గ్రామంలో ఉన్న కుంట దగ్గర బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి వెళ్లి పేకాటాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.12,430ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

## గుంతల రోడ్లను మరమ్మత్తులు చేయించాలి



**కొత్లపల్లి, జూలై 22, ప్రభాతవార్త:** ఆత్మకూరు నుంచి దుద్యాల వరకు దుద్యాల గ్రామం నుండి ఇస్కాల రోడ్లు గుంతల రోడ్లను మరమ్మత్తులు చేయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజు, మండల అధ్యక్షులు మద్దిలేటి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్‌కు గుంతలరోడ్డు బాగుచేయడం కోసం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి దుద్యాల, అలాగే దుద్యాల నుంచి ఇస్కాల రోడ్లు గుంతలమయంగా మారి ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉన్నందన్నారు. ఈరోడ్లలన్నింటిని సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పడిన స్థానంలో గుంతలు పూడ్చి తారురోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉన్న ఈరోడ్డు మీదుగా అనునిత్యం ఇస్కాల, లింగాల, చెలిమిల్ల నాగంపల్లి, కొక్కెరంచ, ఎదురుపాడు, జడ్డువారిపల్లె, కొత్తమడుగుల లింగాల వంటి గ్రామాల ప్రజలు రాకపోకలు జరుగుతాయన్నారు. ఈరోడ్డుపై బస్సులు, టిప్పర్లు, లారీలు, ఆటోలు, బైకులు, ఎద్దుల బండ్లు, సైకిళ్లు అనునిత్యం తిరుగుతున్నాయి. ఈవాహనాలు తిరగడం వల్ల రోడ్డు గుంతలు ఏర్పడి రోడ్లపై నీళ్లు నిలబడి పూర్తిగా దెబ్బతినడం జరిగిందన్నారు. దీంతో ప్రజలు రోడ్డుపై తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దుద్యాల నుండి ఇస్కాల రోడ్డును ఆర్‌అండ్‌బి అధికారులు బాగుచేస్తామని ముందుకు వచ్చి జేసిబితో రోడ్డును తొలగించి గుంతలు ఏర్పాటుచేయడం జరిగింది. అయితే రోడ్డుపై ఉన్న గుంతలు ఇంతవరకు పూడ్చడం గానీ, రోడ్డు వేయడం గానీ చేయకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండి పలు వాహనాదారులు ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రోడ్డుబాగుచేస్తామని చెపి గుంతలు తవ్వి రోడ్డు వేయకుండా నిర్లక్ష్యం వహించిన ఆర్‌అండ్‌బి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగరాజు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షులు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ చేరిన గిరిజనులు

**కొత్లపల్లి, జూలై 22, ప్రభాతవార్త:** న్యాయం కోసం గిరిజనులు పోలీస్‌స్టేషన్ వెళ్లారు. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని పెద్ద గుమ్మడాపురం గిరిజన గూడెంకు చెందిన భూమని పెద్ద బక్కన్న, శివమ్మల కుమార్తె ఈరమ్మకు 14 సంవత్సరాలు అయితే అదే గూడెంకు చెందిన ఐలేని వెంకటేశ్వర్లు, నాగలక్ష్మమ్మ కుమారుడు ఐలేని రాముడు ఇద్దరు ప్రేమించుకున్నారు. వారు ఇరువురు ఆదివారం ఇంట్లో నుంచి దొంగతనంగా ముసలిమడుగు గ్రామ శివారులో ఓ గుడిలో పెండ్లి చేసుకున్నారు. దీంతో ఈరమ్మ తల్లిదండ్రులు తమ బిడ్డను మాయమాటలతో రాముడు మోసం చేసి ఇంటి నుంచి తీసుకెళ్లారని తమ బిడ్డను మాతో పంపించాలని వారు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. అయితే పెద్ద బక్కన్న తన కూతురును ఎంతపనిచేశావు అని మందలిస్తుండగా అదిచూసి అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ బక్కన్నను మా ముందే నీ కూతురుని మందలిస్తావా అని బూతులు తిడుతూ చెంపపై చెల్లుమని మూడుసార్లు దాడులు చేశాడని బాధితులు వాపోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనపై పోలీసు అధికారి చేయి చేసుకోవడం ఎంటని ప్రశ్నించారు. న్యాయం కోసం పోలీస్టేషన్‌కు వస్తే న్యాయంచేయాల్సిన పోలీస్ అధికారే మాపై దాడికి తెగబడడం బూతులు తిట్టడం ఏంటని ప్రశ్నించారు. నాపై చేయి చేసుకున్న హెడ్‌కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మైనర్ అని తెలిసి కూడ దొంగతనంగా పెళ్లి చేసుకున్న రాముడుపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఈరమ్మ తల్లిదండ్రులు కోరారు. ఈవిషయంపై ఎస్ఐ హరిప్రసాద్‌ను వివరణ కోరగా స్టేషనల్‌లో పోలీసుల ఎదుట మైనర్ బాలిక తండ్రి ఆమెపై చేయి చేసుకోవడం తప్పని, అదే సమయంలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ కూడ బాలిక తండ్రిపై చేయి చేసుకోవడం కూడ తప్పెనని ఇరువురికి ఉద్దేశ్యాలు పిల్లల భవిష్యత్తుకోసమేనని గమనించి ఇరువురికి సర్ధిచెప్పి సమస్య పరిష్కారం చేశామని ఎట్టికేలకు మైనర్ బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల వెంట ఇంటికి పంపించామని వివరణ ఇచ్చారు.

## తల్లిని కోల్పోయిన పిల్లలకు భరోసా కల్పించిన రాఘవ లారెన్స్ ఫౌండేషన్

– ఐదుగురు ఆడపిల్లలు... తండ్రి ఆదరణకు కరువు

– చేరదీసిన ఫౌండేషన్ అధ్యక్షులు నాగరాజ్



**ఆదోనిలీగల్, జూలై22, ప్రభాతవార్త;** కడు పేదరికం నుంచి ఉద్భవించి తల్లిని కోల్పోయిన ఐదుగురు ఆడపిల్లలకు మేమున్నామంటూ బదినేహాల్ రాఘవలారెన్స్ ఫౌండేషన్ ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకుంది. సమాజసేవలో భాగమైన రాఘవ లారెన్స్ ఫౌండేషన్ తల్లిని కోల్పోయి అనాథలుగా ఉన్న ఐదుగురు ఆడపిల్లలకు ఆ ఫౌండేషన్‌వారు అండగా నిలిచారు. ప్రస్తుతానికి తమ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులోని దాతలు వెతికి వారి విద్యాభివృద్ధికి, భవిష్యత్‌కు పునాదులు వేయాలన్న సంకల్పంతో ముందుకు కదిలారు. సోమవారం రాఘవలారెన్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంస.నాగరాజు, ఉపాధ్యక్షులు గద్వాల్ తాహెర్‌హుసేన్ ఆదోని పట్టణంలో బాలాజీ స్వీట్ స్టాల్ సమీపంలో వారి బంధువులను పిలిపించి ఆ పిల్లలతో మాట్లాడి వారిని అక్కున చేర్చుకుని మానవత్వం చాటుకున్నారు. అభం శుభం తెలియని ఆ ఆడపిల్లలను తమ వాహనాల్లో ఎమ్మిగనూరులోని ఓ దాత దగ్గరకు తీసుకెళ్లి వారికి అవసరమైన చేయూత సహకారాన్ని అందించడమేకాకుండా వారి విద్యాభివృద్ధికి అవసరమైన విషయాలు కూడా దాతతో చర్చించినట్లు అధ్యక్షులు నాగరాజు తెలిపారు. గతంలో కూడా రాఘవ లారెన్స్ ఫౌండేషన్ ఎన్నో సేవా కార్యక్రమాలు అందించిన దాఖలాలు ఉన్నాయి. తల్లిని కోల్పోయి అనాథలుగా మిగిలిన ఐదుగురు ఆడపిల్లను అక్కున చేర్చుకుని వారి భవిష్యత్‌కు తమ ఫౌండేషన్ ద్వారా అవసరమైన చేయూతనందిస్తామని సంస్థ అద్యక్షులు నాగరాజు తెలిపారు. తల్లి చనిపోయి రెండేళ్లు అయినా తండ్రి ఆదరణకు దూరమై అవ్వ దగ్గరే తలదాచుకుంటున్న ఈ ఆడపిల్లల బతుకులు వింటేనే ప్రతిఒక్కరికీ హృదయం చలించిపోతుంది. అందుకు ఈ ఐదుగురు ఆడపిల్లలకు వారి భవిష్యత్‌కు భద్రత కల్పించే దిశగా ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి వారివారి సహకారం అందించాల్సిన అవసరం ఉందని రాఘవ లారెన్స్ ఫౌండేషన్ సభ్యులు కోరుకుంటున్నారు. తమ సంస్థ ద్వారా చేతినైన వాళ్లు సాయం అందిస్తామని ఇంకా దాతలు ఎవరైనా మానవత్వంతో ముందుకు వస్తే తమని సంప్రదించాలని రాఘవ లారెన్స్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగరాజు తెలిపారు.

## పాఠశాల స్వీపర్స్ వేతనాన్ని పెంచాలి

**ఆదోనిలీగల్, జూలై22, ప్రభాతవార్త;** మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో స్వీపర్స్‌కు పనికి తగ్గ వేతనం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధీర్ఘంగా 30 యేళ్లపాటు మున్సిపాలిటీ ప్రాథమిక పాఠశాలలో వంశపారపర్యంగా స్వీపర్, ఆయాలుగా విధులు నిర్వహిస్తున్నారని,ప్రరభుత్వం ఇచ్చే రూ.4 వేలతో పూట గడవడం కష్టతరంగా మారిందన్నారు. పనికితగ్గ వేతనం రూ.12 వేలు కల్పించాలని కోరారు. గతంలో పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వలేమని మండల విద్యాశఖ అధికారి, మున్సిపాలిటీ కార్మికులను ఇబ్బంది పెడితే ఏఐటీయూసీ నాయకత్వంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మున్సిపల్ కౌన్సిల్ ద్వారానే జీతాలు చెల్లించేవిధంగా మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో స్వీపర్లకు ఇచ్చే రూ.4 వేలు ఏమాత్రం సరిపోవడంలేదని, పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రూ.12 వేల వేతనాన్నిప్రరభుత్వం కల్పించి ఆదుకోవాలన్నారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఖాతాల్లో జమ చేయాలన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**కొత్లపల్లి, జూలై 22, ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక రోగాల భారీన పడకుండా ఉంటామని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మహామ్మద్ బేగ్ సిహెచ్ఓ బాలకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని పాలెం చెరువు గూడెంలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్టాఫ్ డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందరభంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధుల దూరం అవుతాయన్నారు. అలాగే కాచి వడగట్టిన నీటిని తాగాలని, వేడిగా ఉన్నప్పుడే ఆహారపదార్థాలు భుజించాలన్నారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలన్నారు. వాంతులు, బేదులు అయిన వెంటనే ఓఆర్ఎస్ ద్రావకాన్ని తాగించి వైద్యసిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు వివరిస్తు దోమలను నివారించేందుకు దోమతెరలను వాడాలని సూచించారు. లెప్రసి ఇంటింటి సర్వే అనుమానితులను అన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. క్షయవ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే గల్లనమూన పరీక్షలు లేదా ఎక్స్‌రే తీయించుకొని నిర్థారించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పిహెచ్ఎన్ అయేషా బేగం, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సూపర్‌వైజరు దేవ కరుణమ్మ, గుర్రప్ప, శైలజా, శ్రీరాములు, సరితా తదితరులు పాల్గొన్నారు.

